నిశిత ధర్మదృష్టి

యశస్కర మహారాజు ప్రాసాదంముందు ఘోరుమని పెద్ద కలకలం చెలరేగింది. జనం గుంపులు గుంపులుగా చేరి మున్ముందుకు తోసుకువస్తున్నారు. రాజభటులు వారిలో జొరబడి కొందరిని వెనువెంటనే వెనక్కి నెట్టివేస్తున్నారు.

మహారాజ సౌధానికి ఎదురుగా ఉన్న సువిశాల ప్రాంగణంలో బక్క చిక్కిన బ్రాహ్మణు డొకడు ఆమరణాంత ప్రాయోపవేశ దీక్ష ప్రారంభించాడు. కాశ్మీరంలో తమ కేదైనా అన్యాయం జరిగినప్పుడు ఒక్కొక్కప్పుడు ఆయా వ్యక్తులు అన్నపానా లుజ్జగించి ఆమరణాంత నిరాహారదీక్ష లారంభిస్తారు. రాజ్య పరిపాలనలో దురన్యాయా లేవయినా జరుగుతున్నప్పుడు బ్రాహ్మణుల పరిషత్తే స్వయంగా కల్పించుకుని ప్రాయోపవేశాలు ప్రారంభింప జేయిస్తూంటుంది.

అయితే గుమ్మపాలవంటి కాశ్మీర బ్రాహ్మణుల వంశంలో ప్రాదుర్భవించిన యశస్కర మహీపతి ధర్మపరిపాలనలో అటువంటి విడ్డూరాలు ఎప్పుడో సకృత్తుగా గాని సంఘటిల్ల లేదు. కనకనే ఆనాడు కాశ్మీర రాజధాని శ్రీనగరి పౌరు లంతగా ఆశ్చర్యపడుతూ అదే విషయం తమలో తా మనేకవిధాలుగా ముచ్చటించుకుంటున్నారు.

అంతలోనే పెద్ద నీలి తలపాగాతో ఒక రాజాధికారి మిక్కిలి అడుకువతో ప్రాయోపవేశం ప్రారంభించిన వ్యక్తిని సమీపించి ఆ దీక్ష విరమించవలసిందని పరిపరివిధాల వేడుకున్నాడు. ఆ పైన నయానా భయానా బాగా బెదిరించి చూశాడు. అయినా ఆ బ్రాహ్మణుడు ఆ అధికారి మాట ఆవంతయినా చెవి కెక్కనియ్య లేదు. ఆతని పేరు వీరేశ్వర భట్టారకుడు. ఆ మంకుపట్టు, గట్టి పట్టుదల, పౌరుషము ఆ నామధేయానికి తగ్గట్టుగానే ఉన్నాయని ఆ మహాధికారి విసుక్కున్నాడు. అతడు ఆ రోజులలో ఇటువంటి ప్రాయోపవేశ దీక్షల వ్యవహారాలు పర్యవేక్షించే

పరిపాలక వ్యవస్థ పరమాధికారి. అయినా వీరేశ్వరభట్టారకుడు అతని మాట పట్టి ఎండు గడ్డిపోచ అన్నట్టు కొట్టి పారేశాడు!

పురాతన కాలంనించి ఎంతటి పరమ బ్రహ్మణ్యులయినా కాశ్మీర విప్రులు ఎముకలు కొరికివేసే చలి భరించలేక సామవేద పారాయణ సమయంలో ద్రాక్షామదిర సేవించేవారు. అయితే యశస్కరమహారాజు అది కేవలం దురాచారమని నిర్ణయించి పూర్తిగా నిర్మూలించివేశాడు. ఇంకా అటువంటి దురాచారాలెన్నో ఆ ధర్మమూర్తి చల్లని ఏలుబడిలో నిశ్శేషంగా రూపుమాసిపోయాయి. ఎక్కడా ఏ విధమయిన అలజడి, ఆందోళనా లేక ప్రజానీకం హాయిగా తన మనుగడ కొనసాగించుకొంటున్నది.

మరి ఈ వీరేశ్వరభట్టారకుడీ విధంగా ప్రాయోపవేశం కొనసాగించడాని కేమిటి కారణము? పోనీ అనుకుంటే ఇతగాడు దీనికి గల అసలు కారణమేమో మహారాజుతో తక్క తదితరుల కెవ్వరికీ వెల్లడించ నంటున్నాడు. వెల్లడించినా ప్రయోజనం లేదని శఠిస్తున్నాడు.

మహాధికారి కొక్కమారుగా దురహంకారావేశం తలకెక్కింది. ఆ మూర్ఖ విప్రుణ్ణి రాజప్రాసాదం ప్రాంగణంనించి దూర దూరంగా తొలగించి వెయ్యాలని నిర్ణయించుకున్నాడు. మరుక్షణంలోనే అతని కనుసన్న గ్రహించి రాజభటు లిద్దరుముగ్గురు అతణ్ణి అక్కడినించి వేరొకచోటికి తీసుకుపోవాలని శాయశక్తులా ప్రయత్నించి బలవంతంగా తమ సందిట ఇరికించుకున్నారు.

వీరేశ్వరభట్టారకుడు కాళ్ళతో, చేతులతో వారి నొక్కుమ్మడిగా విదిలించివేశాడు! ఆ విధంగా బలాత్కరిస్తే అక్కడే ఉరిపోసుకొని మరణించగలనని భుజంమీది అంగవస్త్రం మెడచుట్టూ బిగించుకుని దాని కొసలు రెండూ రెండు చేతులతోనూ గట్టిగా పట్టుకున్నాడు.

అది గమనించి ప్రజలొక్కుమ్మడిగా రాజభటులపై విరుచుకుపడి వారి నక్కడినించి తరిమివేసి ప్రాయోపవేశాధికారి మీదికి లంఘించారు! దానితో అతని కిక కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు!

అప్పటికప్పుడే కొంచెం చీకటిపడింది. మహారాజ ప్రాసాదం పైఅంతస్తులపై కాచగోళాలలో దీపికలు జాజ్వల్యమానంగా వెలుగు

తున్నాయి. పలచని లేతవెన్నెల రాజవీథిలో చీకటి నొరుసుకుని చిన్న సెలయేరులా ప్రవహిస్తున్నది. క్రమక్రమంగా ఆ చీకటిలో జనసందోహం కొద్దికొద్దిగా పలచబడుతున్నది. రాజవీథిలో వాహ్యాళినుండి మరలివస్తున్న క్షత్రియ యోధుల ఉత్తమాశ్వాల డెక్కల సవ్వడులు అప్పుడప్పుడు మృదంగ ధ్వనులన్న విభ్రాంతి కలిగిస్తున్నాయి.

మహారాజు ఆ సమయానికి సాయంకాల సంధ్యాదికం ముగించుకుని, భోజనాత్పూర్వం రవంత విశ్రమించే అలవాటు కనక మహాప్రాయోప వేశాధికారి బాగా జంకుతూనే ద్వారాధికారి ముఖతః తన రాక నివేదించాడు. అతికష్టంమీద దర్శనం లభించగానే వీరేశ్వరభట్టారకుని ప్రాయోపవేశ వ్యవహారం తనచెయ్యి దాటిపోయిన వృత్తాంతం తడబడుతున్న పలుకులతో సంగ్రహంగా విన్నవించాడు.

యశస్కరుడది ఆలకించి రవంతసే పాలోచించి వెంటనే వీరేశ్వర భట్టారకుని తన సమక్షానికి తోడుకొని రావలసిందని కనుసన్నతో ఆజ్ఞాపించి పూజాభవనంలో చిత్రాసనంపై సమాసీనుడయినాడు. అంతగా ఆమరణాంతం ప్రాయోపవేశదీక్ష స్వీకరించవలసివచ్చిన అతనికి జరిగిన దురన్యాయం ఏమయి ఉంటుందా అని ఆలోచించడం ప్రారంభించాడు. అదే సమయంలో యశస్కరునికి తన పిన్ననాటి దుర్భర దారిద్ర్యము, ఇరుగు పొరుగుల ఈసడింపులు, తలవని తలంపుగా కాశ్మీర సింహాసనాధిపత్య ప్రాప్తి ఆదిగాగల పూర్వగాథలు కొన్ని స్మృతివీథిలో క్రమక్రమంగా సాక్షాత్కరించాయి.

2

క్రీస్తుశకం 939 తరవాత కాశ్మీరంలో ఉత్పల రాజవంశం పరిపాలన పరిసమాప్తమయింది. ఆ వంశీయులలో చిట్టచివరివాడు ఉన్మత్తావంతి కన్నతండ్రినే రహస్యంగా సంహరింపజేయించిన పరమ పాపి. అయితే చిట్టచివరి కతనికి అనేకమయిన దుస్సహవ్యాధులతో, వ్యథలతో అంత్యదశ సంప్రాప్తించింది. అప్పటి కతనికి సంతతిలేదు. అయితే అంతకు మునుపే ఎవరో ఒక పసివాణ్ణి అతి రహస్యంగా అంతఃపురంలో చేర్పించి

అతడే తన కుమారుడయినట్టు ప్రకటింపజేయించి మరణించాడు. కాని ఆ పరమ రహస్యం కొంతవరకు శ్రీనగరిలో నలుగురి నోటా పడి పొక్కింది.

అదే తరుణంలో సర్వసైన్యాధిపతి కమలవర్ధనునికి కాశ్మీరరాజ్యం చేజిక్కించుకోవాలన్న తహతహ కలిగింది. రాజధాని కెంతో దూరంలో ఉన్న ఆ సేనాని తన సైన్యాలతో తక్షణమే ప్రయాణమై శ్రీనగరం చుట్టుముట్టి అచిరకాలంలోనే రాజభవనంలో ప్రవేశించాడు. ఆ దుర్వార్త మున్ముందుగానే పసికట్టిన ఉన్మత్తావంతి పట్టపురాణి తన దత్తపుత్రునితో బాటు వేరొక సురక్షిత ప్రదేశానికి తొలగిపోయి తలదాచుకున్నది.

ఇటువంటి అల్లకల్లోలా లేర్పడి, రాజ్యం అరాజక మయిపోతున్నప్పుడు కాశ్మీర బ్రాహ్మణ పరిషత్తు సమావిష్టమై సమర్థుల నెన్నుకుని వారికే రాజ్యాధికారం సంక్రమింపజేస్తూంటుంది. ఆ కాలంలో ప్రముఖులేకాక ప్రజలందరూ ఆ పరిషత్తు అంతిమ నిర్ణయాని కిక తిరుగులేదని శిరసావహించి అనుసరిస్తారు. ఇప్పు డా పరిషత్తు సమావేశం ప్రారంభమయింది.

అయిదారు దివసాలవరకు దాని తర్జనభర్జన లెటూ తెగలేదు. అది గ్రహించిన సర్వసేనాని కమలవర్ధనుడు పరిషత్తు మధ్యలో దోసిలికట్టి నిలిచి పట్టపురాణి పెంపకంలో ఉన్న కుమారుడు ఉన్మత్తావంతి ఔరసుడు కానేకాడన్న పరమరహస్యం నెమ్మదిగా బయటపెట్టాడు. నీళ్ళు నములుతూ, రాజ్యాధికారం తన కప్పగించినపక్షంలో ప్రజల అలజడి క్షణంలో పటాపంచ లయిపోగలదని శపథంపట్టి వాగ్దానం చేశాడు. కాని పరిషత్తులో బ్రాహ్మణుల కెవ్వరికీ అతనిపై సద్భావం కలగలేదు. పైగా ప్రస్తుత రాజ్యకల్లోలాని కతడే ప్రధానకారణమని వారందరూ ఒక్కమారుగా గొంతులెత్తి దూషించి దుమ్మెత్తిపోశారు. ఇటుకరాళ్ళు రువ్వి మరి తమ దరిమానానికయినా రాకుండా దూరదూరంగా తరిమివేశారు! ఆ మరునాడు పట్టపురాణి తన కుమారునికే రాజ్యాధికారం సంక్రమింపజేయించవలసిందని యశస్కరుని ముఖతః బ్రాహ్మణ పరిషత్తు కొక విజ్ఞప్తి పంపించింది.

యశస్కరుడు కాశ్మీర విప్రులలో అంతగా ఉత్తమ వంశీయుడు కాడు. కాని అతని తండ్రి, తాత కాశ్మీర రాజన్యుల కోశాధికారులయి

సముచిత గౌరవం సంపాదించుకున్నారు. యశస్కరుడు కొంచెం పెరిగి పెద్దవాడయిన తరవాత తాత, తండ్రి సంపాదించిన సంపత్తి అంతా అప్పులపాలయి పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. అతని కిక ఆ పూటయినా గడపని దుర్భర పరిస్థితి తటస్థించింది. అయినా యశస్కరు డధైర్యపడలేదు. నిరంతర శ్రమకోర్చి, చిరకాలం గురుకుల వాసంచేసి మహా విద్వాంసు డనిపించుకున్నాడు. అంతేకాక వాదోపవాదాలలో దిగ్దంతులయిన అనేక మహా విద్వాంసుల నోడించి గొప్ప మేధావి, వక్త, వాదోపవాదచతురుడు అన్న ఘనకీర్తి గడించుకున్నాడు. అందువల్లనే తన కుమారుని పక్షం వహించి వాదించి, అతనికి రాజ్యాధికారం హస్తగతం చేయించవలిసిందని పట్టపురాణి అమూల్య బహుమతు లందించి ఆ మనీషిని ప్రార్థించింది.

యశస్కరుడు వర్చస్వి. స్ఫురద్రూపి. కొంచెం పొడగరి. సూదివలె కొనదేరిన నాసికతో, రవంత దీర్ఘమయిన ముఖంతో, సహజ సరళ వాక్చాతుర్యంతో, సుప్రసన్న హసితంతో అత డెంతెంతటివారినయినా ఇట్టే ఆకట్టుకోగలడు. ఆనా డతని అనర్గళ వాగ్ధోరణి విని బ్రాహ్మణ పరిషత్తులో గల విద్వాంసులందరు ముగ్ధులయి వట్టి చిత్రప్రతిమలే అయినారు! అయితే తన యావచ్ఛక్తీ వినియోగించి ఎంతగా ప్రయత్నించినా యశస్కరుడు పట్టపురాణి కుమారుడు ఉన్మత్తావంతి ఔరసుడే అన్న విషయం మాత్రం తగినన్ని యుక్తులతో బుజువుపరిచి అందరిచేత ఔనౌనని ఒప్పించలేకపోయాడు.

ఇక గత్యంతరం కానలేక ఉసూరుమని నిట్టూర్చి వెనకడుగువేసి మరలిపోయే సమయంలో బ్రాహ్మణ పరిషత్తు అధిపతి అతనిని తిరిగి తన సన్నిధికి పిలిపించి కాశ్మీర రాజ్యాధికారం స్వీకరించి, ప్రజానీకంలో చెలరేగిన అలజడి తొలగించవలసిందని దోసిలికట్టి బ్రతిమాలుకున్నాడు!

యశస్కరు డా ప్రార్థన విని ఆత డొకవేళ వ్యంగ్యంగా వేళాకోళం చేస్తున్నాడేమో అని అనుమానించాడు. కాని ఆ ప్రార్థన యథార్థమే అని స్పష్టపడిపోయింది. మహారాజ్ఞి పక్షం వహించి వాదించడానికి వచ్చిన తా నా విధంగా రాజ్యాధికారం స్వీకరించడం న్యాయంకాదని

యశస్కరు డాపైన బహువిధాల వేడుకున్నాడు. కాని పరిషత్తు అధిపతి దాని కంగీకరించలేదు. బ్రాహ్మణ పారిషదులందరు అధిపతి నిర్ణయం ఘనంగా ఉన్నదని ముక్తకంఠాలతో అంగీకరించి జయజయ ధ్వానాలతో అభినందించారు. ఆ మరునాడే యశస్కరుని రాజ్య పట్టాభిషేక మహోత్సవం యథావిధిగా జేగీయమానంగా జరిగిపోయింది.

అప్పటినించి యశస్కరు డొక్క నిమేషమయినా విశ్రమించక కాశ్మీర రాజ్య వ్యవహారాలన్నీ వెయ్యి కళ్ళతో పరిశీలించాడు. ఒకొక్కప్పుడు బ్రాహ్మణ పరిషత్తులో సదస్యు లెవరయినా ఎంతెంతటి వారయినా తన పరిపాలనలో అన్యాయ్యంగా జోక్యం కలగజేసుకోవడానికి ప్రయత్నిస్తే వారి మాట లేమాత్రమూ లక్ష్య పెట్టలేదు. "తామేం కదా, నన్నీ రాజ్యధర్మ నిర్వహణలో నియమించిన మహనీయులు! అటువంటి మీరే నన్నీవిధంగా పెడదారి పట్టించడం న్యాయం కాదు!" అని నిష్కర్షగా మందలించి, మరి వారిని మహారాజ భవనం పరిసరాలలో నయినా అడుగుపెట్ట నియ్యవద్దని సింహ ద్వారాధికారిని గట్టిగా హెచ్చరించాడు.

ఆ తీరులో నిరంతర జాగరూకతతో తన రాజధర్మం యథావిధిగా నిర్వహిస్తున్న యశస్కరునికి ఆనాడు వీరేశ్వరభట్టారకుని ప్రాయోపవేశ దీక్ష ఒక పెద్ద విడ్డూరంగా, బెడదగా, దుస్సహమయిన తలవంపుగా తోచింది. ఆనాటి రాజ్యకార్య నిర్వహణలో ఇను మిక్కిలిగా అలిసిన అతడు ఉసూరుమని నిట్టూర్చి "పరమేశ్వరా! కలలోనయినా ఊహించని ఈ మహా రాజ్యాధిపత్యము, అపారసంపత్తి అనాయాసంగా సంప్రాప్తించినా నేనేమి సుఖించాను! నా కొక్క లిప్త అయినా విశ్రాంతి లేదే! దీనికన్నా యాయవారమయినా మేలే!" అనుకున్నాడు.

ఆ విధమయిన అతని ఆలోచన ఏడెనిమిది నిమిషాలకన్న ఎక్కువ కాలం కొనసాగలేదు. అంతలోనే ప్రాయోపవేశాధికారి వీరేశ్వరభట్టారకుని ప్రభువు సమక్షానికి తోడుకువచ్చి, వెనుదిరగకుండానే సవినయంగా వెనక అడుగులు వేసుకుంటూ నెమ్మదిగా నిష్క్రమించాడు.

భట్టారకు డా పూజా భవనంలో ప్రవేశించి చిరుదీపికల కాంతిలో

జాజ్జ్వల్యమానంగా వెలిగిపోతున్న పైడి పాత్రలవైపు, పూజా ద్రవ్యాల వైపు, ప్రభువువైపు చూచి క్షణకాలం నోట మాటలేక నిశ్చేష్టితుడయినాడు. ఎంతో అడకువతో సాగిలపడి నమస్కరించి మహారాజు ప్రశ్నించకుండానే తన గోడు ప్రారంభించాడు. చిట్ట చివరికి శ్రీనగర మహత్తర స్థేయాంసుని సమక్షంలో కూడా తన కన్యాయ్యమే జరిగిందని మొరపెట్టుకున్నాడు. మహాస్థేయాంసుడంటే కాశ్మీర దేశానికంతటికీ గొప్ప న్యాయాధికారి. ఆవిధంగా క్రమక్రమంగా ముగ్గురు ధర్మ సంరక్షకులు తన కన్యాయం చేసిన పిమ్మటే, మరి గత్యంతరంలేక, ప్రాయోపవేశం ప్రారంభించవలసి వచ్చిందని స్వకీయదీక్షు సమర్థించుకున్నాడు.

అ మాటల ధోరణినిబట్టి వీరేశ్వరభట్టారకుడు వేదవేత్త అయినా పట్టి అమాయకుడని, అయితే మొండి పట్టుదలగల శిఖండి అని యశస్కర భూపతి క్షణంలో పసికట్టివేశాడు. అందువల్ల చల్లగా అనునయ ధోరణిలో తన ప్రసంగం ప్రారంభించాడు.

"తమవంటి వేదమూర్తులు ఈ రాత్రివేళ అతిథులుగా విచ్చేయ్యడం నా మహాభాగ్యం. దయతలిచి నాతోపాటు విందారగిస్తే అంతకన్న మరి కోరుకోవలసిన దేదీ లేదు."

"తమవంటి ధర్మప్రభువుల కటాక్షం ప్రసరిస్తే నా భుక్తికేమి కొదవ! అయితే నా వ్యవహారం రవంత సావకాశంగా చిత్తగించవలసిందని మనవి."

"తెల్లవారిన పిమ్మట, అధికరణ స్థానంలో, శ్రీనగర న్యాయాధీశ్వరుల సమక్షంలో మీ వ్యవహారం అంతా ఆమూలాగ్రంగా పరిశీలిస్తున్నాము గదా! దానికింత తొందరపాటేమి వచ్చింది?"

అతని వ్యవహారం వినడానికి కాశ్మీరాధిపతి రవంతయినా అంగీకృతి వ్యక్తీకరించలేదు! కాని ఆతిథ్య మర్యాదప్రకారం తనతో విందారగించకపోవడం కేవలం తన కవమానమే కాగలదని వ్యంగ్యంగా సూచించాడు. వీరేశ్వరభట్టారకుని కేమనడానికీ పాలుపోలేదు! నిజాని కతనికి తన ప్రాయోపవేశం విరమించడాని కిష్టంలేదు. కాని మహారాజ ప్రార్థన తిరస్కరించడానికి ధైర్యం చాలలేదు. రవంతసే పాలోచించాడు.

"మహాప్రభూ! తమవంటివారి సరసన కూర్చుని విందారగించడంకన్న నావంటి నిరుపేద కింకేమి ఘనగౌరవమున్నది? అయితే తమ సమక్షంలో కూడా న్యాయం జరగని పక్షంలో తిరిగి నే నిదేవిధంగా ప్రాయోపవేశం ప్రారంభించక తప్పదు."

"దానికేమి! మహా ధర్మాధికరణంలో నావల్ల కూడా న్యాయం జరగలేదని తోచినప్పుడు మీరు తప్పక తిరిగి ప్రాయోపవేశం ప్రారంభించవచ్చును. కాని ఆ దీక్ష ప్రారంభించడానికి కూడా ఒక ధర్మమన్నది ఉన్నది కదా! నేనుగాని, మీరుగాని అణువంతయినా ధర్మాతిక్రమణం చెయ్యరాదు కదా!"

భట్టారకునికి యశస్కరుని చిట్టచివరి వాక్యంలో గల అంతరార్థం బోధపడకపోలేదు. అయినా ఆ మహారాజుపై గల గౌరవం కొద్ది ఆతడా రాత్రి ప్రభువు సరసన తృప్తిగా విందారగించాడు. లోలోపల అనుమాన మేదో కొంచెం వేధిస్తున్నా, మహారాజ భవనంలో హంసతూలికా తల్పంపై పవ్వళించిన మరికొంతసేపటికి గుండెలపై చెయ్యి పెట్టుకుని గుర్రుపట్టి హాయిగా నిద్రించాడు.

3

ఆ మరునాడు మధ్యాహ్నం మూడు ఝాముల వేళ శ్రీనగర మహా న్యాయ భవనంలో యథావిధిగా వీరేశ్వరభట్టారకుని వ్యవహార పరిశీలనం ప్రారంభమయింది. యశస్కర మహీపతి సమున్నత వేదికపై స్వర్ణ సింహాసనం అధిష్ఠించగానే వందిమాగధులు గభీర స్వరాలతో కైవారాలారంభించారు. చామరగ్రాహిణులు రవంత శిరస్సు లల్లన వంచుకుని వింజామర లటు ఇటు లీలగా కదిలించారు. మహా న్యాయభవనం పెను గవాక్షాలనుండి వెలువడిన హేమంతకాలం నీరెండ మహాధికరణంలో కొందరి శిరోవేష్టనాలపై ప్రసరించింది. వీరేశ్వరభట్టారకుని వ్యవహారం చిట్టచివరి కేవిధంగా పరిణమించగలదో అన్న ఆత్రత మహా న్యాయభవనం లోనే కాక, దాని పరిసరాలలో నలువైపులా వ్యాపించింది. ఆ భవనం చుట్టు జనం గుంపులు గుంపులుగా గుమిగూడి అదే వ్యవహారాన్నిగురించి మాట్లాడుకుంటున్నారు.

శ్రీనగర మహా న్యాయాధికారితో బాటు అతనికి తక్కువ స్థాయిలో ఆ వ్యవహారం పరిశీలించిన గ్రామ న్యాయాధిపతి, మండల న్యాయాధిపతి కూడా ఆ భవనంలో సమాసీనులయినారు. వీరేశ్వరభట్టారకుడు, అతని సాక్షులు, అతడు నిర్దేశించిన దోషి, అతని సాక్షులు అందరు తమ తమ కేర్పరచిన వేర్వేరు స్థానాలలో సంసిద్ధులయినారు.

మున్ముందుగా వీరేశ్వరుడు తన వ్యవహారం అంతా కొంత ఆవేశంతో నివేదించడం ప్రారంభించాడు. మొట్టమొదట మహారాజు తన్నెంతో ఆదరించి ఆతిథ్య మర్యాద నెరపినా, ఆ సమయంలో తన గోడు సంగ్రహంగానయినా ఆలకించలేదని భట్టారకుడు మనస్సులో బాగా మథనపడ్డాడు. అయితే నిష్పక్షపాత దృష్టితో వ్యవహారం పరిశీలించే సంకల్పంతోనే మహారాజు ఆవిధంగా చేసి ఉండవచ్చునని సరిపెట్టుకున్నాడు. ఆపైన అతనికి రాజసమక్షంలో కూడా తన కన్యాయం జరగగలదేమో అన్న అనుమానము, భయము కలగకపోలేదు. అయినా ఆ దైవేచ్ఛ ఏ విధంగా ఉంటే అలాగే జరగగలదని గుండె రాయి చేసుకుని, మధ్య మధ్య ఇనుమడిస్తున్న గద్గదికతో తన సంగతి నివేదించాడు. అతడు వివరించిన వృత్తాంతం అంతా ఇది.

4

భట్టారకుడు చాలా సామాన్య సంసారి. దున్నుకోవడాని కేదో కొంత కొండ్ర ఉన్నది గాని దానితో పట్టుమని పదిమాసాలపాటయినా అతని సంసారయాత్ర సాగదు. తన కుటుంబంలో అనుశ్రుతంగా వస్తున్న సామవేదమే కాక అతడు మిగిలిన వేదాలు మూడూ పదంతో, క్రమంతో, జటతో అధ్యయనంచేసి జటాంత స్వాధ్యాయి అన్న ఘనకీర్తి గడించుకున్నాడు. కాని ఏమి లాభం? సంపన్నులెవరో ఇద్దరు ముగ్గురు సంవత్సరాని కింత అని ముట్టజెప్పే స్వల్ప వార్షికాలతో అతని దైనందిన జీవితం గడవడమే దినదిన గండంగా తయారయింది.

అతనిది శ్రీనగరాని కనతిదూరంలో గల చిన్న పల్లెటూరు. గంపెడు పిల్లలతో సంసారం గడవడమే కష్టమై తండ్రి సంపాదించిన కొండ్ర కాస్తా తెగనమ్మివేశాడు. అయినా సంసారయాత్ర సాగలేదు. అడుగడుగునా ఆ జటాంత స్వాధ్యాయిని దుర్భర దారిద్ర్యం వెంటాడింది.

ఇక గత్యంతరం కానలేక ఏడెనిమిది నెలలపాటు కాశ్మీరంలో అంతటా పర్యటనం ప్రారంభించి వేదాభిమానులను కొందరిని సందర్శించి, వారి నాశ్రయించి ఒక నూరు బంగారు దీనారాల సొమ్ము కూడబెట్టు కున్నాడు. దానితో తన కుటుంబాని కంతటికి ఒక ఏడాదికాలం అన్న వస్త్రాల కే కొదవా ఉండదని బ్రహ్మానంద పడ్డాడు.

కాని అంతలోనే దురదృష్టదేవత తిరిగి అతనిని వెన్నాడింది. తన గ్రామానికి మరలిపోతూ మార్గ మధ్యంలో లవణోత్స గ్రామంలో ఒక ధర్మ సత్రంలో విశ్రమించాడు.

ఆ నూరు సువర్ణ దీనారాలూ ఒక రాగి చెంబులో పోసుకుని, మూతి గట్టిగా అతికించి దాన్ని తన ఉత్తరీయం కొసకి ముడివేసి వెంటబెట్టుకు పోవడం ప్రయాణంలో అతని కలవాటు. ఆ ధర్మ సత్రంలో మరునాడు ఉదయమే, స్నానంచేసే సమయంలో, రాగి చెంబు బిగించిన ఉత్తరీయం బావి అంచుమీద అతి భద్రంగా ఉంచి స్నానం ప్రారంభించాడు. అంత లోనే పెనుగాలి వీచింది. ఆ ఉత్తరీయం రాగి చెంబుతోబాటు జారి నూతిలో పడిపోయింది!

అది ఏడెనిమిది నిలువుల లోతున్న పెద్ద బావి. పాపం, వీరేశ్వర భట్టారకుడు ఆ హఠాత్ప్రమాదం గమనించి పెద్ద పెట్టున గొంతెత్తి ఆక్రోశిస్తూ ఇరుగు పొరుగు గ్రామస్థుల ఎదట తన విషాదగాథ వెల్లడించు కున్నాడు.

ఏడెనిమిది నిలువుల నూతిలో దిగి బాగా ఊపిరి బిగబట్టి అట్టడుగున గాలిస్తేగాని ఆ ఉత్తరీయం చేజిక్కించుకోవడం సాధ్యపడదు. అందుచేత అక్కడ ఉన్న ఆ గ్రామస్థు లెవ్వరూ నూతిలో దిగడానికి సాహసించలేక పోయారు.

ఏడెనిమిది మాసాలపాటు అష్టకష్టాలుపడి ఆర్జించుకున్న ద్రవ్యం అంతా ఆ విధంగా హరించుకుపోయే సరికి భట్టారకు డిక ఆ దుర్భర దైన్యం భరించలేక అంగవస్త్రంతో మెడను ఉరిపోసుకుని అక్కడే మరణించవలెనని నిశ్చయించుకున్నాడు.

అంగవస్త్రం కంఠానికి చుట్టబెట్టుకుంటున్న తరుణంలో అంతకు మునుపు అతని దుస్సహాక్రోశం విన్న మారుతి అన్న మహా బలశాలి

అక్కడికి చేరుకున్నాడు. అత డొక కూలివాడు. మారుతి తొందర తొందరగా భట్టారకుని సమీపించాడు.

"ప్రాణాపాయమయినా లక్ష్యపెట్టక ఆ నూతిలో దూకి ఆ నూరు బంగారు దీనారాలూ అప్పగిస్తే మీరు నాకేమి ఇస్తారు?" అతనివైపు నిశితంగా చూసి ప్రశ్నించాడు.

దానితో భట్టారకుని ప్రాణాలు లేచివచ్చాయి. పరమానంద భరితుడై మెడ ఉరి తొలగించుకున్నాడు.

"నాయనా! ఇంతటి ఉపకారం చేస్తే నేను నీకేమి ఇవ్వగలను? న్యాయ్యంగా నీకు తోచినదేదో నీవే తీసుకుని మిగిలినదే నా కియ్యి!"

అంతకుమునుపే నలుగురైదుగురు గ్రామస్థు లక్కడ పోగుపడ్డారు. మారుతి వారందరి సమక్షంలోను భట్టారకునివైపు చూసి, "మీరు మాట తప్పకూడదు మరి!" అని రెట్టించాడు.

"నాయనా, ఎంతమాట! నిత్యము వేదవాణి వినవచ్చే నా నోట అనృతం వెలువడగలదనుకున్నావా?"

వీరేశ్వరుడు జంధెం చేతబట్టి మాట ఇచ్చాడు.

మారుతి వెనువెంటనే ఒకే ఒక్క గంతుతో నూతిలో దూకి, ఇంచుమించుగా ఒక గడియకాలంలో ఆ ఉత్తరీయానికి కట్టిన మూటతో బయటపడ్డాడు. ఆ రాగిపాత్ర మూతి తొలగించి, దానిలో తొంభై ఎనిమిది సువర్ణ దీనారాలు తాను తీసుకుని, రెండే రెండు భట్టారకుని కందించాడు. దానితో అతడు అది కేవలం ఘోర దురన్యాయమని ఘోష పెట్టాడు. కాని అక్కడ ఉన్న సాక్షు లెవ్వరూ అతణ్ని సమర్థించలేదు. ఆపైన క్రమక్రమంగా గ్రామ న్యాయాధిపతివద్ద, మండల న్యాయాధీశుని వద్ద తన వ్యవహారం నివేదించుకున్నాడు. వారిద్దరు కూడా మారుతిదే న్యాయమని తీర్పులిచ్చారు. అయినా అధైర్యపడక శ్రీనగర మహా న్యాయాధీశుని సమక్షంలో తన వ్యవహారం నడిపించాడు. అక్కడ కూడా మారుతి పక్షమే న్యాయమని తీర్పుపుట్టగానే మరి వేరే దిక్కులేక ఆమరణాంత ప్రాయోపవేశదీక్ష ప్రారంభించాడు.

ఆ తీరులో భట్టారకుడు తన వ్యవహారం నివేదించగానే శ్రీనగర న్యాయాధిపతి సవినయంగా లేచి యశస్కర మహీజానికి నమస్కరించి, భట్టారకునివైపు తిరిగి కొన్ని ప్రశ్న లడిగి అతడు చెప్పినదంతా యథా

ర్థమే అని బుజువుపరిచాడు. ఆటుపిమ్మట మారుతివైపు తిరిగి "వీరేశ్వరుల కథనంలో అసత్యమేమయినా ఉన్నదా?" అని ప్రశ్నించాడు. అతడది అంతా యథార్థమే అని అంగీకరించాడు. ఆపైన సాక్షుల విచారణ జరిగింది. దానిలో కూడా వీరేశ్వరభట్టారకుని కథనంలోగాని, మారుతి కథనంలోగాని వ్యత్యాసమేమీ గోచరించలేదు.

సాక్షుల పరీక్షలోగాని, వాది ప్రతివాదుల వాఙ్మూలాలలోగాని, వివరణలోగాని వ్యత్యాసమేమయినా బయటపడితే జాగ్రత్తగా పర్యాలోచించి న్యాయ నిర్ణయం చెయ్యవచ్చునని యశస్కరు డాలోచించాడు. ఎక్కడా ఆవంతయినా తేడా కనబడలేదు! 'మరి దీనిలో ఇంత రభస చెలరేగడాని కవకాశమేమున్నది?' అని క్షణకాలం వితర్కించుకున్నాడు. అంతలోనే అతనికి భట్టారకునికి జరిగిన దురన్యాయమేమో క్షణంలో అవగతమయింది!

అదేక్షణంలో శ్రీనగర న్యాయాధిపతి తటాలున లేచి నిలిచి, రెల్లు పూలవలె నెరిసిన తన కనుబొమ్మ లల్లన వంచి బొమముడి విరిచి ప్రశ్నించాడు.

"భట్టారకా! మరి మీ కీ వ్యవహారంలో జరిగిన దురన్యాయ మేమి ఉన్నది?"

"మహాప్రభూ! మారుతితో నేను 'నాయనా! నీకు న్యాయంగా తోచినదేదో తీసుకుని మిగిలినదే నాకియ్యి' అని చెప్పిన మాట అక్షరశః యథార్థమే! అయితే నేనది పరమానందం పట్టలేక ఉబ్బి తబ్బిబ్బయి చెప్పిన మాట! అంతేకాని నే నతనికి అంత సొమ్ము ఇవ్వదలుచుకోలేదు. అంత పెద్ద నూతిలో దిగి మూట బయటికి తీసినప్పుడు న్యాయ్యంగా రెండు మూడు వెండి దీనారాలకన్న ప్రతిఫలం ఇవ్వనక్కరలేదు గదా! పోనీ, అంతగా శ్రమించినందుకు ఒక పైడి దీనారం తీసుకుని మిగిలినది తిరిగి నా కిచ్చివెయ్యగలడని ఆశించాను. నిజానికి అదే చాలా పెద్ద ప్రతిఫలం! కాని మారుతి దురాశాపరుడై..."

"మహాప్రభూ! అధికరణం సమక్షంలో ప్రతివాది మారుతికి దురాశ ఆరోపించడం న్యాయ్యం కాదు!"

శ్రీనగర ప్రధాన న్యాయాధికారి తటాలున లేచినిలిచి ఆ మాట కడ్డుపడి తన అధిక్షేపం వెల్లడించాడు.

యశస్కర మహారాజు దానిని అంగీకరిస్తున్నట్టు నెమ్మదిగా, హేలగా శిరస్సు పంకించాడు.

వీరేశ్వరుడు తిరిగి ప్రారంభించాడు: "ధర్మమూర్తీ! నా దురాశారోపణ అపరాధమే. అంగీకరిస్తున్నాను. ఇక నా కథ. ఆపైన మారుతి రెండే రెండు కాంచన దీనారాలు నా చేతికిచ్చి, మిగిలిన దీనారాలన్నీ స్వాయత్తం చేసుకున్నాడు. ఏదో మర్యాదకోసం మాటవరసకని అన్న మాట అక్షరాలా అలాగే జరిగితీరాలని భీష్మించుకుని కూర్చున్నాడు."

"అన్నమాట తప్పరాదు సుమా! అని మిమ్మల్ని నేనప్పుడు రెట్టించి ప్రశ్నించానా, లేదా? మీరప్పుడు జందెం పట్టుకుని అలాగే అని అంగీకరించారా, లేదా? ధర్మస్వరూపులయిన ప్రభువుల ముఖం చూసి నిజం చెప్పండి!"

మారుతి తటాలున సూటిగా ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న విని భట్టారకుడు మరి మాట్లాడలేక క్షణకాలం మౌనం వహించి, "అది అంతా యథార్థమే" అని అంగీకరించి శిరస్సు వంచుకున్నాడు.

వెనువెంటనే మారుతి అందుకున్నాడు: "మహారాజా! నా కుటుంబంలో అన్నదమ్ములతో, అక్కచెల్లెళ్ళతో, తలిదండ్రులతో, నా భార్యతో, పిల్లలతో కలిసి మొత్తం పదహారుగురున్నారు! మా సంసారానికంతటికి సంరక్షకుడను నేనే! మా గ్రామం పెనుబావిలో పడినవారిని బయటికి తియ్యడంకోసం లోపలికి దిగిన జమాజెట్టీలెవ్వరూ మరి ప్రాణాలతో బయట పడలేదు! అటువంటి నూతిలో దిగి బయటపడిన నా పంచప్రాణాలు నూరు బంగారు దీనారాలకన్న బాగా విలువైనవే అని విన్నవించుకుంటున్నాను. తమ రీ విషయం రవంత దివ్యచిత్తానికి తేవాలని నా ప్రత్యేక విజ్ఞప్తి."

మారుతి విన్నపంతో అధికరణం అంతా రెండు మూడు క్షణాల పాటు స్తబ్ధమయినట్టు పొడకట్టింది. శ్రీనగర న్యాయాధిపతి అది ప్రస్తుత వ్యవహార పరిశీలనకు కొంత అనవసర ప్రసంగమయినట్టు రూక్షంగా అతని వైపు చూశాడు. అయినా మారుతి అదేవిధంగా విన్నవిస్తున్నట్టు మహారాజు కట్టెదుట దోసిలి కట్టుకుని నిలుచున్నాడు.

ఆపైన శ్రీనగర న్యాయాధిపతి లేచి నిలిచి గౌరవ సూచకంగా శిరస్సు వంచి మహారాజు నుద్దేశించి ప్రసంగించాడు.

"ప్రభువర్యుల కీవిషయం సమగ్రంగా అవగతమే. అయినా తిరిగి దివ్యచిత్తాని కొకమారు తేవాలని నివేదించుకుంటున్నాను. ప్రాచీనకాలం నించి మన పవిత్ర భూమిలో కేవలం మాట కట్టడివల్లనే వ్యవహారాలన్నీ పరిపూర్ణ ధర్మపద్ధతిలో నడుస్తున్నాయన్న విషయం తా మెరిగినదే. తగు మనుష్యుల సమక్షంలో జరిగిన ఒప్పందాలన్నీ తామ్రశాసనాలవలె, శిలాక్షరాల వలె సర్వులూ మన్నించి శిరసావహిస్తున్నారు!

"ఎక్కడో సకృత్తుగాగాని భూర్జపత్రాలలో లిఖించడ మన్నది జరగడంలేదు. అదీగాక వాది ప్రతివాదుల సాక్ష్యాలలోగాని, వాఙ్మూలాలలోగాని ఎక్కడా రవంతయినా వ్యత్యాసం కానరాలేదు. ఇందువల్లనే నాకు గ్రామ మండల న్యాయాధిపతు లిద్దరితోనూ ఏకీభవించడం తక్క వేరొక్క గత్యంతరం కానరాలేదు."

"అది యథార్థమే. అయితే ఆయా ఒప్పందాల పదాలలో గల పరమార్థమేమో పరిశీలించనక్కరలేదా?"

ప్రభువు మంద్రస్వరంతో ప్రశ్నించాడు. శ్రీనగర న్యాయాధీశ్వరుని కా ప్రశ్నతో పచ్చి వెలక్కాయ గొంతున చిక్కుపడ్డట్టయింది. క్షణకాలం నిరుత్తరుడై తిరిగి తన చర్య సమర్థించుకున్నాడు.

"మహారాజా, కాశ్మీరంలో అనూచానమయిన ధర్మపద్ధతి ప్రకారం మాకు ఆయా వాగ్దానాల ఒప్పందాలన్నీ కేవలం వాచ్యంగానే సమన్వయించే అధికారం మాత్రమే ఉన్నది. అంతేగాని అంతకన్న మా కధికారం లేదు. అదీగాక కేవలం వాగ్దానాలవల్ల ఏర్పడిన కట్టడులకు తాత్పర్యార్థాలు పరిశీలించడం ప్రారంభిస్తే ధర్మాధర్మాలే తారుమారై పోగలవేమో అని భయపడుతున్నాం. ఆపైన దేవరవారి చిత్తం."

యశస్కరుని కంతకుమునుపు ఎప్పుడోగాని, ధర్మాసనంపై అధిష్ఠించి న్యాయం నిర్ణయించే ఆవశ్యకత కలగలేదు. ఆ వ్యవహారం అంతా జటిలమయిన ఒక పెద్ద బెడదలా తోచింది. శ్రీనగర న్యాయాధిపతి తా నీ క్లిష్ట పరిస్థితిలోనించి తప్పించుకోడానికే కేవలం సంప్రదాయ పద్ధతి అవలంబించి గ్రామ మండల న్యాయాధీశ్వరుల తీర్పులకే ఆమోదముద్ర

ఖుర్రించినట్టు గ్రహించుకున్నాడు. మరికొంతసేపటివరకు యశస్కరుని ఏమని తీర్పు ఇవ్వడానికీ పాలుపోలేదు.

కాశ్మీరాధీశ్వరుని అంతిమ నిర్ణయంకోసం అధికరణం అంతా ఊపిరి బిగబట్టి ఎదురుచూస్తున్నది. మరికొన్ని నిమేషాలలో యశస్కరభూపతి ముఖతః మంద్ర గంభీరస్వరంతో తుదితీర్పు క్రమ క్రమంగా వెలువడింది.

‘‘కేవలం పురాతన సంప్రదాయం ప్రకారం పరిశీలిస్తే మారుతి చేసినదానిలోగాని శ్రీనగర న్యాయాధీశ్వరుల తీర్పులోగాని తప్పిదమేమీ లేదు.’’

అది వినగానే వీరేశ్వరునికి ముఖం వెలవెలబోయింది. శ్రీనగర న్యాయాధిపతి ముఖం వికసించింది.

అంతలోనే యశస్కరుని ఉదాత్త ప్రసంగం తిరిగి న్యాయభవనంలో ప్రతిధ్వనించింది.

‘‘అయితే పంచమవేదమయిన మహాభారత సంహిత ప్రవచించిన శ్రీకృష్ణద్వైపాయనులు ధర్మ నిర్ణయం ఒక్కొక్కప్పుడు అసిధారావ్రతం వంటిదని, బహు క్లిష్టమని అనేక పర్యాయాలు తమ సంహితలో నొక్కి వక్కాణించారు. ఒక్కొక్కప్పుడు అధర్మమే ధర్మస్వరూపంతో లోకం కన్ను కప్పివేస్తున్నది! ధర్మాన్ని కాలరాచి మట్టివేస్తున్నది! ఒక్కొక్కప్పుడు పరమధర్మమే వట్టి అధర్మంలా పరిణమిస్తున్నది!’’

యశస్కరభూజాని వ్యక్తీకరించిన ఆ సునిశిత ధర్మదృష్టికి న్యాయాధీశ్వరులేకాక వాది ప్రతివాదు లిరువురు, వారివైపు సాక్షులూ మిక్కిలి ఆనందించారు.

అంతలోనే యశస్కరుడు తిరిగి వివరించాడు.

ఇందువల్ల వీరేశ్వరభట్టారకుల మాటలు కేవలం మర్యాదతో, ఆదరంతో అన్నట్టుగానే స్వీకరించాలి. అంతేగాని వాటికి వట్టి వాచ్యార్థం స్వీకరించరాదు. ఇందుచేత మారుతికి ఆయన ఇవ్వాలని సంకల్పించుకున్న ఒకేఒక పైడి దీనారమే బాగా ఎక్కువ. అయినా అదే మారుతికి చెందాలని నిర్ణయిస్తున్నాము. మిగిలిన తొంభయితొమ్మిది దీనారాలు వీరేశ్వర భట్టారకులకే చెందాలని శాసిస్తున్నాము.’’

సూక్ష్మ ధర్మ పరిశీలనంతో వెలువడిన ఆ నిర్ణయానికి న్యాయాధీశ్వరులందరు ఔనౌనని హర్షించారు. అంతలోనే శ్రీనగర న్యాయాధిపతి లేచి ప్రభువు నభినందించాడు.

“న్యాయస్వరూపులయిన ఏలిక నిర్ణయం సర్వులకు బ్రహ్మానందం కలిగించింది. నా మట్టుకు నా కిదే విధమైన నిర్ణయం న్యాయ్యం కాగల దేమో అని స్ఫురించకపోలేదు. అయితే నాకున్న అధికార పరిమితి ననుసరించి తోచిన తీర్పు ఇవ్వక తప్పలేదు! ఈ సూక్ష్మ ధర్మం పరిశీంచవలసినది తాముకాని మేము కాదు గదా!”

ఆ ప్రసంగం మిగిలిన న్యాయాధిపతులకు, వెలుపల వేచిఉన్న జనానికి మరింతగా మహోల్లాసం కలిగించింది. వీరేశ్వరభట్టారకుడు తన కా తీర్పులో సంపూర్ణ న్యాయం లభించగలదని కలలోకూడా ఊహించలేదు. తిరిగి ఆనందావేశంతో తలమునకలయి కాశ్మీరాధిపతి కెంతో అడకువతో నివేదించాడు:

“ప్రభూ! మహావిద్వాంసులు, ధర్మరహస్యవేత్తలు అయిన తమవల్ల కాశ్మీరంలో ధర్మదేవత సుఖంగా నాలుగు పాదాలతోను పోరాడుతున్నప్పు డిక ఆశ్చర్యమేమి ఉన్నది? ఇక ఒక చిన్న విజ్ఞప్తి. మారుతి దారుణ మరణమయినా లక్ష్యపెట్టక నా దీనారాలన్నీ భద్రంగా వెలువరించాడు. ఇందువల్ల నేనాతనికి ఇంకొక్క బంగారు దీనారం కూడా బహూకరిస్తున్నాను!”

ఆ అమాయిక వేదనిధి ఔదార్యం కాశ్మీర మహీపతికే కాక మారుతితోబాటు అందరికి మైమరుపు కలిగించింది!

—:o:—